క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న పూజారి

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలిమంగమ్మ సమేత స్వామివారి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యాక్రమాలను చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



బాధితులను విచారిస్తున్న కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్

సి.బెళగల్: మండలంలోని తిమ్మందొడ్డి గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ విచారణ చేశారు. శనివారం కోడుమూరు సీఐ తబ్రేజ్, స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డితో కలిసి గ్రామంలో బాధితులు, నిందుతులను విచారించారు. కాగా మండల పరిధిలోని మాల సోమాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామ శివారులో భూములున్న నందవరం మండలం సోముల గూడూరు గ్రామానికి చెందిన పరిగెల జాన్‌రాజుకు అదే గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు, అతని కుటుంబ సభ్యుల మధ్య ఈనెల 9వ తేదీ పొలానికి సాగునీరు కట్టుకునే విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సి.బెళగల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు పరిగెల జాన్‌రాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ తిమ్మారెడ్డి ఈనెల 13వ తేదీ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. శనివారం తిమ్మందొడ్డి గ్రామ శివారులోని పంట పొలాలు, ఘర్షణ పరిస్థితులను పరిశీలించిన డీఎస్పీ బాబు ప్రసాద్, కేసు సంబంధించిన అంశాలను, వారి వివరాలను నమోదు చేసుకున్నారు.

నేడు విద్యుత్ వేళల్లో మార్పు

ఓర్వకల్లు: కర్నూలు పట్టణ శివారులోని కార్బైడ్ ఫ్యాక్టరీలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఓర్వకల్లు మండలంలోని ఓర్వకల్లు, నన్నూరు, కాల్వబుగ్గ, ఉయ్యాలవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు పనివేళల్లో తాత్కాలిక మార్పులు చేసినట్లు విద్యుత్ ఏఈ సునిల్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్పు చేసిన సమయం ప్రకారం తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు సవరించామన్నారు. రైతులు మార్పులను గమనించాలని ఏఈ కోరారు.

నాగేశ్వరయ్యకు జాతీయ ప్రతిభా పురస్కారం



నాగేశ్వరయ్య

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, కళాకారుడు, ప్రవచన కర్త కేవీ నాగేశ్వరయ్య ×తెలుగు కీర్తి₹ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కారం ప్రదానం చేయనున్న శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈఓ కత్తి మండ ప్రతాప్ అధికారికంగా సమాచారం అందించినట్లు నాగేశ్వరయ్య తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు సంయుక్తంగా ఈనెల 21న విజయవాడంలోని శ్రీ కౌతాపూర్ణానంద విలాస్ కళావేదికలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. సాహిత్య, కళా, సామాజిక, ధార్మిక రంగాల్లో విశేష కృషి చేస్తున్నందుకు నాగేశ్వరయ్యకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఇటీవల విడుదలైన సీతారం సిత్రాల అనే తెలుగు సినిమాలో తండ్రి పాత్రలో ఆయన నటించారు. కీర్తి పురస్కారానికి ఎంపికైన నాగేశ్వరయ్యకు పలువురు సాహితీ వేత్తలు, కళాకారులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రభుత్వం నిర్లక్ష్యం

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షులు కె.బలరామ్ విమర్శించారు. శనివారం కర్నూలులోని ప్రజాపరిరక్షణ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా డీటీఓ, ఆర్‌టీఓ అధికారుల్లో స్పందన లేదన్నారు. జాతీయ రహదారులపై ఆర్‌టీఓ అధికారులు తనిఖీలు నిర్వహించి మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న వారి లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. సమావేశంలో సమితి నాయకులు హుసేనయ్య, సంజన్న, సూర్య ప్రదీప్, రాజు, రాజేష్, డేవిడ్, రమేష్, మోహన్ రెడ్డి, క్రిష్ణచాపే పాల్గొన్నారు.

చెత్త సంపద ఉత్తదే..!

- లక్షలు వెచ్చించి నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీలు
- వాడుకలేక నిరుపయోగంగా మారిన వైనం
- మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు వేదికలు
- పట్టించుకోని అధికారులు





నిరుపయోగంగా మారిన బూజునూరు చెత్త సంపద కేంద్రం, బుట్టలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వాసుదేవ గుప్తా (ఫైల్)

గడివేముల: చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) చెత్త సంపద కేంద్రాలను గ్రామాల్లో నిర్మించారు. లక్షలు వెచ్చించి కేంద్రాలను నిర్మించినప్పటికీ ఉపయోగించుకోవాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నిర్లక్ష్యంతో అవి నిరుపయోగంగా మారాయి. చెత్తను సేకరించి దాని ద్వారా సందను సృష్టించి పంచాయతీకి ఆదాయం తీసుకురావాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. గడివేముల మండలంలో 16 పంచాయతీల్లో చెత్త సందప కేంద్రాలను నిర్మించారు. ఒక్కో కేంద్రానికి రూ.2.5 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకు ఎంజీఎస్‌ఆర్‌జీఎస్ నిధులు కేటాయించారు. పంచాయతీని బట్టి కేంద్రం కొలత ఆధారంగా నిధులు ఖర్చు చేశారు. ఈ కేంద్రాలను నిర్మించి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అప్పగించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయంతో ఈ కేంద్రాలను నడపాల్సి ఉంది. గ్రామాల్లో ప్రతి ఇంటికీ రెండు చెత్తబుట్టలు కూడా పంపిణీ చేశారు. ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను సేకరించేందుకు పారిశుద్ధ్య కార్మికులతో పాటు చెత్త రిక్షాలు, ఆటోలు, ట్రాక్టర్లను పంచాయతీలకు పంపిణీ చేశారు.

చెత్త నుండి సంపద సృష్టి ఇలా..

ఇళ్లల్లోని చెత్తను పొడి చెత్త, తడి చెత్తగా వేర్వేరు చెత్త బుట్టలో వేయాలి. వాటిని గ్రామాల్లో నియమించిన కార్మికుల ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి చెత్త రిక్షాలు, ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తారు. కేంద్రాల్లో నిర్మించిన సిమెంట్ తొట్లల్లో చెత్తను వేరు చేస్తారు. పొడి చెత్తలో ఉండే ప్లాస్టిక్ వస్తువులు, పేపర్లు, అట్టలు, సీసాలు, చెక్క ముక్కలు, క్లాత్ వంటివి వేరు చేసి అక్కడ నిర్మించిన తొట్లలో నిల్వ చేస్తారు. కొంత సేకరణ అయిన తర్వాత వాటిని విక్రయించి వచ్చిన నగదును పంచాయతీకి జమ చేస్తారు. అదే విధంగా తడి చెత్తను ఆ కేంద్రాల్లో ప్రత్యేకంగా నిర్మించిన తొట్లలో వేసి వర్మి కంపోస్టును తయారు చేస్తారు. తయారైన వర్మీకంపోస్టును గ్రామాల్లోని రైతులకు విక్రయించి నగదు పంచాయతీకి వచ్చేలా చేస్తారు. ఇలా చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలకు ఆధాయం తీసుకురావాలనే లక్ష్యంగా ఈ చెత్త సంపద కేంద్రాలను నిర్మించారు. గ్రామాల్లోని చెత్తను రోడ్ల పక్కన, కాలువల్లో, ఊరి శివారు ప్రాంతాల్లో పడవేయడం. చెత్తను కాల్చివేయడం వంటి చేయకుండా గ్రామాల పరిశుభ్రతతోపాటు, ఆదాయం తీసుకురావాలనేది దీని ఉద్దేశం.

అధికారుల నిర్లక్ష్యం

చెత్త సేకరించేందుకు పారిశుద్ధ్య కార్మికులున్నారు. సేకరించేందుకు చెత్త వాహనాలున్నాయి. చెత్త వేరు చేసి చెత్తబుట్టల్లో వేసి ఇచ్చేందుకు బుట్టలు కూడా ఇంటింటికీ పంపిణీ చేశారు. మండలానికి మంజూరైన 19,455 చెత్త బుట్టలను గత ఏడాది అక్టోబర్ 7వ తేదీ ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అందజేసినట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్తా తెలిపారు. అయినా కేంద్రాలను ఉపయోగించకపోవడం కేవలం అధికారుల నిర్లక్ష్యమే అని చెప్పవచ్చు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం కారణంగానే చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. లక్షల రూపాయలు వెచ్చించి కేంద్రాలను నిర్మించినప్పటికీ వీటిని ఉపయోగించడంలో లక్ష్యం చెత్తపాలైంది.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా..

మండలంలో 14 చెత్త సంపద కేంద్రాలను ఆయా పంచాయతీల్లోని శివారు ప్రాంతాల్లో నిర్మించారు. అవి వాడుకలో లేకపోవడంతో ఆ షెడ్ల కింద కొందరు పేకాటాడుతున్నారు. అదే విధంగా మందుబాబులకు అడ్డగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. కనీసం సంపద సృష్టించకపోయినా చెత్తను అయినా ఆ కేంద్రం వద్ద వేస్తే ఇలాంటి ఆకతాయిలకు నిలయాలుగా మారకుండా ఉంటాయి. అప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలు మార్గంలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్రిష్ణ కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణపై శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిష్ణ మాట్లాడుతూ.. కర్నూలు నుంచి కోడుమూరు మీదుగా ఆదోని, ఎమ్మిగనూరు, బళ్లారి, గుంతకల్ వంటి ప్రాంతాలకు నిత్యం అనేక మంది ప్రజలు ప్రయాణం చేస్తుంటారని, అయితే రోడ్డు వెడల్పు లేకపోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా కోడుమూరు నుంచి కర్నూలు మధ్యలో రోజుకో ప్రమాదం జరుగుతోందని, దీని వల్ల ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కు కోల్పోయి రోడ్డు పడుతున్నాయన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కర్నూలు నుంచి కోడుమూరు మీదుగా బళ్లారి వరకు నాలుగులైన్ల రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు రాజు, శేషుకుమార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు





ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో గాయపడిన సుబహాన్, ప్యాలకుర్తి సమీపంలో బోల్తాపడిన లారీ

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులో ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాల మధ్య చోటు చేసుకున్న రెండు ప్రమాదాల్లో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఆలూరు నుంచి పశుగ్రాసం లోడ్‌తో కర్నూలు వెళుతున్న లారీ ప్యాలకుర్తి దాటిన తర్వాత అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అలాగే గోనెగండ్ల మండలం లింగందిన్నె గ్రామానికి చెందిన సుబహాన్ కర్నూలు నుంచి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా, ప్యాలకుర్తి సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబహాన్ కాలుకు గాయాలయ్యాయి. ఇద్దరు బాలికలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రీసర్వేకు సహకరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో త్వరలో ప్రారంభం కానున్న భూముల రీ సర్వేకు మండల ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. శనివారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయం–2లో రీసర్వే నిర్వహణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీ నుంచి ఏడు బృందాలు మండల కేంద్రంలో రీసర్వే చేస్తాయని తెలిపారు. ప్రతి బృందం రోజు 20 ఎకరాల చొప్పున సర్వే చేస్తుందని చెప్పారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సర్వేపై రైతులకు ముందస్తు సమాచారం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాండురంగన్న, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు వెంకటేష్, గౌరి, సర్వే సహాయకులు తిరుమలనాయుడు, వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కల్లూరు: స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న అధికారులు



పాణ్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గడివేముల: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య పనులు



సి.బెళగల్: అవగాహన ర్యాలీ

కర్నూలు(రూరల్): పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం పంచలింగాల గ్రామంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కల్లూరు: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని డీఎల్‌డీఓ రమణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి దీప్తి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పెద్దటేకూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో జరుగుతున్న సేవలను పరిశీలించారు. ఎంఎస్ఎంఈ, హౌస్ హోల్డ్ సర్వే, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఈకేవైసీ తదితర కార్యక్రమాలపై సమీక్ష చేశారు.

పాణ్యం: ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పాణ్యంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అప్పుడే ఆరోగ్య జీవనం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం పాణ్యం ప్రభుత్వ పాఠశాలలోని మైదానంలో కంపచెట్లు, చెత్తను తొలగించారు. సర్పంచ్ మేకల పల్లవి, ఎంఈఓ కోటయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల, ఎంపీడీఓ రాణెమ్మ, ఎంపీపీ బొంతల మునెప్ప, సర్పంచ్ పాండురంగన్న ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం, బురాన్‌దొడ్డి ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. పారిశుద్ధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఈశ్వరయ్యసామి, ఏఈ గోనేనాయక్, వెలుగు ఏపీఎం రామేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా కోరారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండు ప్రాంతంలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం బస్టాండ్, స్థానిక పీహెచ్‌సీ, ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణలో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. స్పెషల్ ఆఫీసర్ జవహర్ బాబు, తహసీల్దార్ వెంకటరమణ, ఈఓపీఆర్డీ మహీధర్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కో ఆర్డినేటర్ గఫూర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి సహకరించండి

- కమిషనర్‌కు విన్నవించిన జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి



భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్ సమీపంలో పూర్తి కావచ్చిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి సహకరించాలని పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం స్థానిక నగరపాలకలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును ఆయనతో పాటు లీగల్ సెల్ నాయకులు కలిశారు. నగరపాలక అధికారుల నోటీసులకు స్పందించిన ఆయన బిల్డింగ్‌కు సంబంధించిన అనుమతులు, వివరాలు తెలియజేశారు. కుడా అధికారుల షార్ట్‌ఫాల్‌కు సంబంధించి అడిగిన వివరాలను మరో 15 రోజుల వ్యవధిలో సమర్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత ఏడాది జూన్ 17 వ తేదీన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులు తీసుకున్నామన్నారు. అలాగే రివైజ్డ్ ప్లాన్, వీఎల్‌టీ ట్యాక్స్, ఫైర్ సేఫ్టీలను సమర్పిస్తామన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు సిటీ: గుణంపల్లి పుల్లారెడ్డి చారిటీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ వృత్తి విద్య డిగ్రీ కోర్సుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీచేశారు. కార్యక్రమానికి కర్నూలు మెడికల్ కాలేజ్, హృదయ, రక్తనాళ శస్త్రచికిత్స విభాగం ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డితోపాటు ట్రస్టు గౌరవ అధ్యక్షులు పి.సుబ్బారెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ జి.రాఘవరెడ్డి, ట్రస్టీ జి.ఏకాంబర రెడ్డి, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. పేద విద్యార్థులను చదువుతో ప్రోత్సహించేందుకు ట్రస్టు ద్వారా ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ట్రస్టు ద్వారా రూ.1 కోటి విలువైన స్కాలర్‌షిప్‌లు 250 మంది విద్యార్థులకు అందజేశారు.

రుణాలను రీషెడ్యూల్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం రామేశ్వర్

సి.బెళగల్: పొదుపు మహిళలు బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించి రుణాలను రీషెడ్యూల్ చేయించుకోవాలని ఏపీఎం రామేశ్వర్ అన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల మహిళా సంఘం (ఎంఎంఎస్) అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన పొదుపు మహిళలు, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, సభ్యులు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజ్ రుణాల మంజూరు, వినియోగం, చెల్లింపులు, పథకాలపై సభ్యులకు వివరించారు. బ్యాంక్ రుణాలను రెగ్యులర్‌గా చెల్లించిన గ్రూపులకు బ్యాంక్‌లు ఎక్కువ మొత్తంలో రుణాలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పొదుపు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీసీలు గుండమయ్య, శ్రీనివాసులు, రాముడు, మాదులు, మహబూబ్‌బాషా, అకౌంటెంట్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. శనివారం సి.బెళగల్ ఎస్సీ కాలనీలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు జాబ్‌కార్డు ఉన్న కూలీలంతా హాజరుకావాలని కోరారు. వలసల నివారణకే ఉపాధి పనులు కల్పిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్ణీత కొలతలతో పనులు చేసిన వారికి గరిష్ఠ కూలి రూ.300 వస్తుందని తెలిపారు. 50 మందికి ఒక గ్రూపుగా మేటీని ఏర్పాటు చేసుకుని పనులకు అవసరమైన మస్టర్లను నిర్వహించుకోవచ్చని ఏపీఓ రామన్న తెలిపారు. సమావేశంలో టీఏ రామ్‌శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు, కూలీలు పాల్గొన్నారు.

రెవెన్యూలో మరో నలుగురు ఆర్‌ఐలకు చోటు

కర్నూలు (టౌన్): నగరపాలక రెవెన్యూ విభాగంలో మరో నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు చోటు లభించింది. గతంలో పనిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు మరోసారి కమిషనర్ రవీంద్రబాబు అవకాశం కల్పించారు. సీనియారిటీ ఉండటంతోపాటు మరో రెండు నెలల వ్యవధిలో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున నలుగురికి బాధ్యతలు అప్పగిస్తూ శనివారం సాయంత్రం నగర పాలక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన ఈ విభాగంలో ఇప్పటికే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.శేషాద్రి ఆరోగ్య సమస్యలతో తనను తప్పించాలని కమిషనర్‌కు విన్నవించారు. దీంతో ఉన్న నలుగురు కొత్త వాళ్లతో ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు, వీఎల్‌టీ, నూతన భవనాలకు పన్నుల విధింపు తదితర పనులు చేయడం ఇబ్బందిగా మారడంతో వారితో పాటు అదనంగా నలుగురికి బాధ్యతలు అప్పగించారు.

కేంద్రం నుంచి నిధుల వరద

- ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ బి.పార్థసారథి

కర్నూలు(సెంట్రల్): కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధుల వరద పారుతోందని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే బి.పార్థసారథి అన్నారు. కేంద్రం ఇచ్చే నిధులతో ఆరు నెలల్లో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ఇదే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు నిద ర్శనమన్నారు. శనివారం ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకపోవడంతోపాటు దాన్ని లాభాల్లోకి తెచ్చేందుకు రూ.11,400 కోట్లు ఇచ్చిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులను కేటాయించే ప్రతిపాదన కూడా కేంద్రప్రభుత్వం వద్ద ఉంద న్నారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి నేరుగా సర్పంచ్‌ల ఖాతాల్లోనే ఆర్థిక సంఘం నిధులను జమ చేస్తున్నట్లు చెప్పారు. 4, 6 లేన్లతో ఎక్కడ చూసినా జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రామస్వామి, కాశీ, సాప్రదీప్ పాల్గొన్నారు.

పనివేళల్లో వైద్యులు విధుల్లో ఉండాలి



ఆసుపత్రి అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనివేళల్లో కచ్చితంగా విధుల్లో ఉండాలని అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పలు విభాగాలను పరిశీలించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అమలయ్యేలా చూడాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో అన్ని హంగులతో ప్రారంభించేందుకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగానికి సీఎంఓలతోపాటు మిగతా సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన ఆక్సీజన్, సివిల్, పరికరాల గురించి వైద్యాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.